

కథా కౌముది

# మిగిలిన మనిషి

శ్రీరాం ప్రణతేజ

"హాయ్ రా ఎలా ఉన్నావ్, ఏం చేస్తున్నావ్? పెళ్ళి చేసుకున్నావా?" అంటూ మూడు వాట్సప్ మేసేజ్ లు వచ్చాయి.

ఓపెన్ చేసి చూసేసరికి నా పీజీ క్లాస్ మేట్ అని తెలిసింది.

నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

పీజీలో వాడూ నేను ఎక్కువగా మాట్లాడుకున్నది లేదు.

నిజానికి వాడు మా ఫ్రెండ్స్ గ్రూప్ కాదు. జనరల్ గా పీజీలో క్లాస్ మేట్స్ అందరూ గ్రూప్స్ గా విడిగా ఉండేవారు. సినిమాలకు వెళ్ళడం, పార్టీలు వంటివి ఆ గ్రూప్ పరిధిలో మాత్రమే జరిగేవి.

క్లాస్ మొత్తానికి సంబంధించిన ఫేర్ వెల్, ఫ్రెషర్స్ వంటి పార్టీలలో మాత్రం అందరం కలిసేవాళ్ళం. కానీ అక్కడ కూడా గ్రూప్ వైజ్ గా స్టేజ్ పర్ఫామెన్స్ ఇచ్చేవాళ్ళం.

మా క్లాస్ గ్రూపుల్లో కొన్ని తేడాలుండేవి. అందమైన అమ్మాయిలు, లోకల్ అబ్బాయిలు కలిసి ఒక గ్రూప్ గా ఏర్పడేవారు.

మా గ్రూప్ లో మాత్రం అందరం నాన్ లోకల్స్ ఉండేవాళ్ళం. ఒక్క అమ్మాయి కూడా గ్రూప్ లో ఉండేది కాదు.

అమ్మాయిలతో మాట్లాలంటే అదోలాంటి బెరుకు ఉండే వాళ్ళందరం కలిసి ఒక గ్రూప్ గా ఏర్పడ్డాము.

ఇప్పుడు నాకు మెసేజ్ చేసింది, అందమైన అమ్మాయిలు ప్లస్ లోకల్ అబ్బాయిలు ఉండే గ్రూపుకు చెందిన ఆనంద్.

ఆనంద్ ఇంత సడెన్ గా ఎందుకు ఎందుకు చేశాడని ఆలోచిస్తూనే,

"బాగున్నాను, ఇంకా పెళ్ళి చేసుకోలేద"ని రిప్లై ఇచ్చాను.

"జాబ్ ఎక్కడ చేస్తున్నావ్?" – మరో మెసేజ్ చేశాడు.

ఏ కంపెనీలో చేస్తున్నానో చెప్పాను, సాలరీ కూడా చెప్పాను.

"ఓకే ఓకే, అప్పుడప్పుడు మెసేజ్ చెయ్ రా" అంటూ ఆనంద్ నుండి మెసేజ్ వచ్చింది.

"ఓకే రా... చేస్తాను" అని స్మైలీ ఎమోజీ పెట్టి చాటింగ్ ఆపేశాను.

ఆనంద్ ఇంత సడెన్ గా ఎందుకు చేశాడన్న ఆలోచనల్లో ఉన్న నాకు, అసలు వాడేం చేస్తున్నాడో అడగాలన్న ఆలోచనే రాలేదు.

అడిగితే బాగుండేదేమోనన్న ఆలోచనతో ఆ రోజంతా గడిపేశాను.

★★★★

కొన్ని రోజుల తర్వాత వినాయక చవితి రోజున ఆనంద్ నుండి, "వినాయక చవితి శుభాకాంక్షలు" అని మెసేజ్ వచ్చింది.

"థ్యాంక్స్ రా, నీక్కూడా" అని మెసేజ్ పెట్టి ఊరుకున్నాను.

వాడు చిన్న స్మైలీ ఎమోజీ పెట్టాడు.

దీపావళికి కూడా విష్ చేశాడు.

ఆ తర్వాత న్యూ ఇయర్ కి కూడా.

ఆనంద్ మెసేజ్ చేసిన ప్రతీసారి నేను కూడా విష్ చేస్తున్నాను. అంతకుమించి ఒక్క మెసేజ్ కూడా ఎక్కువ చేయట్లేదు.

పీజీలో ఉండగా అంతగా పట్టించుకోనివాడు, పీజీ పూర్తయిన మూడేళ్ళ తర్వాత ఎందుకు ఇన్నిసార్లు మెసేజ్ చేస్తున్నాడో అర్థంకాలేదు.

ఆ ఆలోచనల్లో నేనుండగా, ఒకరోజు మా గ్రూప్ కి చెందిన నా పీజీ ఫ్రెండ్ చరణ్ కలిశాడు.

"ఆనంద్ గాడు ప్రతి పండక్కి విష్ చేస్తున్నాడురా" అని వాడే అన్నాడు.

నాక్కూడా చేస్తున్నాడని చెప్పాను.

"ఎందుకు చేస్తున్నాడు?" వాడే అడిగాడు.

తెలియదన్నట్టు ఎక్స్ ప్రెషన్ ఇచ్చాను.

"జాబ్ కోసం అయ్యుంటుంది. వాడి జాబ్ పోయిందేమో! అందుకే మనమేమైనా హెల్ప్ చేస్తామని మనల్ని మంచి చేసుకోవడానికి అయ్యుంటుంది" అన్నాడు.

వాడి మాటలు నిజమే అనిపించింది.

ఎందుకంటే, ఆనంద్ గాడి గ్రూప్ లో చాలామంది జాబ్స్ చేయట్లేదు. ఇంకా ఖాళీగానే ఉన్నారని మొన్నామధ్య ఒక ఫ్రెండ్ ద్వారా తెలిసింది.

ఈ ఆలోచన రాగానే ఆనంద్ గాడి మీద కోపం వచ్చింది. జాబ్ కోసం హెల్ప్ చేయమని డైరెక్ట్ గా అడిగితే అయిపోయేదానికి ప్రతీ పండక్కి విషెస్ చెప్పడం ఎందుకో నాకర్థం కాలేదు.

అదే విషయం చరణ్ తో అన్నాను.

"అలా డైరెక్ట్ గా అడిగితే నువ్వు హెల్ప్ చేస్తావా?"

"వాడు మన గ్రూప్ కాదు కదా..!"

"అమ్మాయిల గ్రూప్ లో ఉంటూ వాడు ఎన్ని ఫోజులు కొట్టేవాడో మర్చిపోయావా? వాటన్నింటినీ మరిపించాలంటే ఇలా కొత్తగా ఫ్రెండ్ షిప్ స్టార్ట్ చేస్తున్నట్లు బిల్డప్ ఇవ్వాలి" అన్నాడు.

చరణ్ గాడు చెబుతున్న ప్రతీమాట నిజమే అనిపించింది.

అదే టైమ్ లో ఆనంద్ గాడికి జాబ్ లేకపోవడం, దానికోసం మమ్మల్ని అడగాలనుకోవడం ఊహించుకుంటుంటే ఏదో తెలియని గర్వంలా అనిపించింది.

మేమెంత ఎదిగిపోయామో అనిపించింది.

ప్రతీ పండక్కి ఆనంద్ నుండి మెసేజ్ వస్తూనే ఉంది.

జనవరి 26 రిపబ్లిక్ డే

శివరాత్రి

ఆఖరుకు నా పుట్టినరోజు నాడు కూడా మెసేజ్ చేశాడు.

నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

సోషల్ మీడియా కాలంలో సోషల్ మీడియా గుర్తుచేస్తే తప్ప ఎవ్వరికీ పుట్టినరోజులు గుర్తుండవు. అలాంటిది సోషల్ మీడియాలో ఎక్కడా లేని నా ఒరిజినల్ బర్త్ డే గుర్తుపెట్టుకొని మరీ విష్ చేశాడంటే ఆశ్చర్యమేసింది.

థ్యాంక్యూ అని మెసేజ్ చేశాను.

అంతకుమించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

నా బర్త్ డే తర్వాత ఉగాది, హోళీ పండగలు వచ్చాయి.

ఆ పండగలకి ఆనంద్ నుండి మెసేజ్ రాలేదు.

ఎందుకో నాకు తెలియదు, నేను కూడా మెసేజ్ చేయలేదు.

ప్రతీ పండక్కి మెసేజ్ చేసేవాడు ఈ పండక్కి ఎందుకు చేయలేదా అని ఆలోచిస్తుంటే ఒక విషయం అర్థమైంది.

ఎన్ని మెసేజెస్ చేసినా థ్యాంక్స్ తప్ప నేను ఎలాంటి రిప్లై ఇవ్వనందువల్ల ఆనంద్ మెసేజ్ చేయడం మానేశాడని అనిపించింది.

ఈ ఆలోచన రాగానే నాకు కోపం వచ్చింది.

మనుషులు మరీ ఇలా ఎందుకుంటారో అర్థం కాలేదు.

నిజంగా ఆనంద్ కి జాబ్ కావాలనుకుంటే నన్ను అడగవచ్చు కదా అనిపించింది. ఇలా మెసేజెస్ చేసి నాటకాలు ఆడటం అనవసరం అనిపించింది.

ఆ తర్వాత కొన్ని రోజులకు నేను ఆనంద్ విషయం మర్చిపోయాను.

ఏదో కావాలని ఆశించే వాళ్ళ గురించి ఆలోచించడం అనవసరం అనిపించింది.

★★★

కొన్ని రోజుల తర్వాత ఒకరోజు మా పీజీ క్లాస్ మేట్ పెళ్ళికి వెళ్ళాను.

అక్కడికి అందరూ వచ్చారు.

అన్ని గ్రూపుల వాళ్లు వచ్చారు.

ఆనంద్, ఇంకో ఇద్దరు మిస్సయ్యారు.

అందరం బాగా మాట్లాడుకున్నాం.

ఆ పెళ్ళిలో మా గ్రూపు, వేరే గ్రూపు అనే తేడా మాకు కనిపించలేదు.

ఫ్రెండ్స్ తో మాట్లాడుతుండగా మాటల మధ్యలో, ఆనంద్ చనిపోయాడని తెలిసింది.

నేను షాకయ్యాను.

నాకు వినిపించిన మాటలు నిజం కాదేమో అనిపించింది.

రెండు సంవత్సరాలుగా బ్రెయిన్ ట్యూమర్ తో ఆనంద్ బాధ పడుతున్నాడని, ట్రీట్ మెంట్ జరిగినా కూడా తాను బ్రతకలేదని మా ఫ్రెండ్స్ చెప్పేసరికి నాకు నోటి నుండి మాటలు రాలేదు.

ఆనంద్ చనిపోయాడు– మా ఫ్రెండ్ మళ్ళీ చెప్పాడు.

నేను మాట్లాడకపోయేసరికి అతడు మళ్ళీ చెప్పాడని అర్థం చేసుకొని, గొంతులోంచి మాటరాకపోయినా కష్టపడి, ఎప్పుడు అని అడిగాను.

మార్చి 15 అతడు చెప్పాడు.

మార్చి 15 అంటే సరిగ్గా నా బర్త్ డే అయ్యాక వారం రోజుల తర్వాత.

ఈ ఆలోచన రాగానే నా బర్త్ డే రోజు ఆనంద్ పంపిన మెసేజ్ గుర్తొచ్చింది.

నాకేమీ అర్థం కాలేదు.

నాలో ఎన్నో ఆలోచనలు తిరుగుతున్నాయి.

ఇంటికి వచ్చాను.

మనసు కుదురుగా లేదు.

నోట్లోంచి మాట రావడం లేదు.

మెదడు ఆలోచిస్తూనే ఉంది.

రెండు సంవత్సరాలుగా బ్రెయిన్ ట్యూమర్ తో బాధపడుతున్న వాడు ఆరు నెలలుగా నాతో టచ్ లో ఉంటూ కూడా ఆ విషయం ఎందుకు చెప్పలేదు.

అంటే ఆనంద్ ఆ విషయం నాతో చెప్పాలనుకోలేదా?

కాదు నాతో చెప్పాలనుకున్నాడు.

అందుకే ఆరు నెలలుగా మెసేజ్ చేస్తూనే ఉన్నాడు.

నేనే ఆనంద్ తో సరిగా మాట్లాడలేకపోయాను. అతను నాకు మొదటిసారి మెసేజ్ చేసింది బాగా గుర్తు.

"హాయ్..ఎలా ఉన్నావ్?" అని అడిగాడు. నేను ఆన్సర్ చేశాను తప్పితే నువ్వెలా ఉన్నావని అడగలేకపోయాను.

ప్రతీ పండక్కి ఆనంద్ విష్ చేసినా, థ్యాంక్స్ అన్నాను తప్పితే అతని గురించి ఏమీ అడగలేకపోయాను.

"నువ్వెలా ఉన్నావ్ రా.. అంతా బాగేనా?" అని నేను అడిగి ఉంటే అతను కొంచెమైనా తృప్తిగా ఫీల్ అయ్యేవాడేమో..!

కొన్ని రోజుల్లో చనిపోతానని తెలిసినపుడు మనిషిలో కోపం, ఆవేశం అన్నీ తగ్గిపోతాయి.

అవతలి వారి నుండి ఆప్యాయత కోరుకుంటాడు.

అది ఎంత ఎక్కువ మంది నుండి వస్తే అంత హ్యాపీగా ఫీల్ అవుతాడు.

ఆనంద్ కూడా అలానే కోరుకున్నాడు.

కానీ నేనే తప్పు చేశాను.

రెండు సంవత్సరాలుగా రోగంతో పోరాటం చేస్తున్నవాడు ఆరు నెలలుగా నాతో స్నేహం కోసం ఆరాటం చెందితే అరనిమిషం కూడా అతని గురించి సరిగ్గా ఆలోచించలేకపోయాను.

బ్రెయిన్ ట్యూమర్ ఆనంద్ ని చంపేసినట్టు నేను అతని మనసును చంపేసాను.

నా మీద నాకు కోపం వస్తోంది.

ఎవరైనా దూరపు బంధువులు ఎప్పుడో ఒకసారి కలిసినపుడు బాగున్నారా అని వాళ్ళు అడిగితే, మీరు బాగున్నారా అని తిరిగి అడుగుతాము.

అలాంటిది నాతో రెండు సంవత్సరాలు కలిసి చదువుకున్న క్లాస్ మేట్ మెసేజ్ చేస్తే మాట వరుసకైనా ఎలా ఉన్నావని ఎందుకు అడగలేకపోయాను.

నేను కొంచెం ప్రేమ చూపించి ఒక్క మాట కలిపితే కనీసం నాతో మాట్లాడుతూ తన బాధ నుండి కొంచెమైనా బయటపడేవాడేమో కదా!

అలాంటి అవకాశం కూడా నేను ఇవ్వలేకపోయాను.

ఆలోచిస్తుంటే నా కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. ఒక కంటిచుక్క నేలను తాకింది.

అలా వరుసగా ధారగా కంటిచుక్కలు నేలమీద పడుతూనే ఉన్నాయి.

మనుషుల్లో మానవత్వం చచ్చిపోతోంది. దానికి నేనే సాక్ష్యం.

మనుషులు మనసు లేని రాయిలా మారిపోతున్నారు. దానికి నేనే ఉదాహరణ.

పక్కవాడిని పలకరిస్తే ప్రమాదం అన్న ఆలోచన పెరిగిపోతోంది.

నన్ను చూస్తే నాకు అర్థమవుతోంది.

ఇప్పటి మనుషుల్లో మనసు ఎప్పుడో చచ్చిపోయింది.

కేవలం శరీరంతో మనిషి మాత్రమే మిగిలాడు.

నాలాగా...!++

COMMENTS